# పేదవాని పైకం

పేరుకి తగ్గట్టుగానే వరహాలరావు శ్రీమంతుడు. ఆగర్భ శ్రీమంతుడు కాకపోయినా, ఏదో ఒక విధంగా శ్రీమంతుడైనవాడు. ఏమయితేనేం, డబ్బు, పొగరు పుష్కలంగా ఉన్నవాడు. అందువ ల్ల సామాన్యుల్ని ముఖ్యంగా నిరుపేదల్ని నిరసించేవాడు. పైకమున్న పెద్దల్నే ఆదరించేవాడు. అలాటివాడి ఔట్‌హౌస్‌లో ఒక సామాన్యుడు నివసిస్తున్నాడు. పేరు మాత్రం గొప్పపేరు. శ్రీపతిరావు! తన పరిస్థితిని బట్టి అతనైతే సన్యాసిరావని పేరు పెట్టుకునేవాడే. కాని తల్లిదండ్రులు పెట్టిన పేరుని మార్చుకోవడం అనుచితమని భావించిన గురుభక్తి అతనిది!

'అయ్యా! మీ ఔట్‌హౌస్ ఖాళీగా వుందా?'

'ఎవరో ఒక సన్నాసి వుంటున్నాడు...'

'అదేవిటండీ చూస్తూచూస్తూ సన్యాసికిచ్చారా అద్దెకి?'

'ఆ సన్యాసికాదులెండి... డబ్బులేని సన్నాసిలెండి'

'ఎంత డబ్బుంటే మాత్రం ఇంత పొగరా!' వరహాలరావుకి వినిపించేలా ఒకరిద్దరు అన్నారు, ధైర్యంగా.

'డబ్బులేని సన్నాసులకు డబ్బున్న వాళ్ళంటే అక్కసు!...' వరహాలరావు అనేవాడు నలుగురూ వినేలా. ఎవరైనా విన్నారో లేదో కాని, శ్రీపతిరావు మాత్రం విన్నాడు. విని కుమిలిపోయాడు. తరువాత తన ను తాను ఓదార్చుకున్నాడు. ఇంతకూ తన లాంటివాడు కలవారి ఆవరణలో ఉండడం అవివేకమనుకున్నాడు. మొదట్లో వరహాలరావు ఎంత ఆప్యాయత ప్రదర్శించాడని!

గృహాన్వేషణ సాగిస్తూ ఒకరోజు సాయంకాలం శ్రీపతిరావు వరహాలరావు బంగళాగేటువద్ద ఆగాడు. వాచ్‌మాన్‌ని చూడగానే అతన్ని పలకరించాలని పించింది.

'ఏం నరసయ్యా యిక్కడ పని చేస్తున్నావా?'

'అవును బాబూ, ఎప్పుడొచ్చారు మన పల్లెనుంచి?'

మూడురోజులయింది. ఈ మహాపట్టణంలో నువ్వుతప్ప నాకు తెలిసిన వాళ్లెవరూ లేరు. నిన్ను చూసేసరికి నాకు ప్రాణం లేచివచ్చిందనుకో...'

'నాకూ అలాగే వుంది బాబూ అదిసరే, యిప్పుడు తమరెక్కడుంటున్నారు?'

'మా మేనేజరుగారు మంచివాడు కాబట్టి, యిల్లు దొరికేంతవరకు ఆఫీసులోనే వుండమన్నారు...'

'అయితే అమ్మగారు పల్లెలోనే వున్నారన్నమాట...'

'ఇల్లు దొరికిన తర్వాత తీసుకువస్తాను. తక్కువ అద్దెలో ఎక్కడైనా రెండు గదుల యిల్లు దొరుకుతుందంటావా?'

'ఒక్క నిమిషం యిక్కడే వుండండి బాబూ ఔటౌసు ఖాళీగా వుంది. మా అయ్యగార్ని కనుక్కుని వస్తాను...'

వెనక్కి తిరిగి నరసయ్య బంగళావైపు చూశాడు. సరిగ్గా ఆ సమయానికి మేడ మీద వరహాలరావు వున్నాడు. ఆయన చూపు చాలాసేపుగా ఎవరితోనో మాట్లాడుతున్న నరసయ్యమీద పడింది. సైగ చేశాడు పైకి రమ్మని. సంతోషం కొద్దీ నరసయ్య వెడుతుంటే, తన అదృష్టం పండిన ట్టుగా భావించాడు శ్రీపతిరావు.

నిజంగానే అదృష్టం పండింది!

ఏడెనిమిది నిమిషాల తర్వాత నరసయ్య తిరిగి వచ్చి, 'బాబుగారూ. మా అయ్యగారు తమర్ని పైకి రమ్మంటున్నారు' అన్నాడు. ఇల్లు దొరికినట్లే అనుకున్నాడు. ఆ ఉత్సాహంతో నరసయ్య వెంట నడిచాడు శ్రీపతిరావు, మాంత్రికుణ్ణి అనుసరించి వెళ్ళే మామూలు మనిషలా.

మేడమీది సోఫాసెట్లు కుర్చీలు నిలువుటద్దాలు మొదలైనవాటిని చూసి శ్రీపతిరావు ఆశ్చర్యచకితుడయ్యాడు. అలాంటివి తానంతకు మునుపు చూడలేకపోవడమే ఆశ్చర్యానికి కారణం. వాటిని చూస్తూ అలాగే నిలుచుండిపోయాడు. నరసయ్య ఏమో వరహాలరావు మామూలుగా వచ్చే

ద్వారం వైపు చూస్తూ చేతులు కట్టుకుని మూర్తీభవించిన వినయవిధేయతల్లా నిలబడ్డాడు.

వరహాలరావు రాకను సూచించేలా అతని పాదరక్షల సవ్వడి గంభీరంగా వినిపించింది. మెల్లగా దగ్గిన దగ్గు కూడా గంటలా వినవచ్చింది. అంతవరకూ ప్రశాంతంగావున్న అక్కడి వాతావరణం ఒక్కక్షణంలో మారిపోయింది, నడమంత్రపు సిరిలో కనిపించే దర్పంలా.

వరహాలరావు సోఫా అలకరించాడు.

'ఇందాక నేను తమతో మనవి చేసిన బాబుగారు ఈయనేనండి' అన్నాడు నరసయ్య గొంతు సవరించుకుని.

శ్రీపతిరావుని ఎగాదిగా చూశాడు వరహాలరావు. ఆ చూపు దోషిని చూసే చూపులా వుంది. అది చూసి నరసయ్య ఏమనుకున్నాడో ఏమిటో, 'బాబుగారు చాలా మంచివారండి... పరమ సాధువు' అన్నాడు.

'మీ సంగతి...' నాలుక కరుచుకుని 'అదే... మీ విషయం మా వాచ్‌మాన్ వివరంగా చెప్పాడు. ఔట్‌హౌస్ నచ్చినట్టేగా. అద్దెకివ్వాల్సిన కర్మ నాకేం లేదు. వాచ్‌మాన్ మాటని తోసెయ్యలేక ఒప్పుకున్నాను. ప్రతినెలా మొదటి తారీకున ఆ అద్దె డబ్బులు మా గుమాస్తాకివ్వాలి. తెలిసిందా...'

'అలాగేనండి'

'అవతల నాకు బోలెడు పనుంది. మాట్లాడే తీరికలేదు. ఏమన్నా యిబ్బందులుంటే మా గుమాస్తాతో చెప్పుకోవచ్చు. అతనే వ్యవహారాలన్నీ చూస్తూవుంటాడు...'

'చిత్తం'

'అన్నట్టు చెప్పడం మరిచిపోయాను. ప్రతిరోజూ మా గేటుముందే పాలుపిండి పోస్తాడు... వాడెవరు?' నరసయ్య వంక చూశాడు వరహాలరావు.

'ఆ ముసలాయన పేరు వెంకయ్యండి...'

'పాలు వెంకయ్య దగ్గరే పోయించుకోవాలి. మాకు పదేళ్లుగా పాలు పోస్తున్నాడు. చాలా మంచి పాలు...' అంటూ శ్రీపతిరావుని చూశాడు.

'అలాగేనండి'

ఆ తర్వాత వరహాలరావు లోపలికి వెళ్ళాడు.

నరసయ్య, శ్రీపతిరావు కిందికి దిగారు. యజమాని మాటలతీరు, వాలకం నచ్చని నరసయ్య, 'తమరేమీ అనుకోకండి బాబూ మా అయ్యగారి తీరే అంత. ఇంకా నయం, యివ్వాళ మీతోనే యింతసేపు మాట్లాడారు' అన్నాడు. వాళ్ళిద్దరూ ఔట్‌హౌస్ చూశారు.

'నీ మేలు మరిచిపోలేను నరసయ్యా. ఉన్నంతలో యిల్లు చక్కగానే వుంది. ఇంత మంచి యిల్లు దొరుకుతుందని నేను కలలోకూడా అనుకోలేదు. అద్దె అంటావా, అనుకున్న దానికంటె కొంచెం ఎక్కువే...'

'ఎక్కువే అయినా అన్ని వసతులూ వున్నాయిగదండీ... ముఖ్యంగా మంచి నీళ్ళు! రోజూ పొద్దునా సాయంకాలం పంపులో వస్తాయి. నీళ్ళకోసం యీ వూళ్ళో చాలామంది యమయాతన పడుతున్నారంటే నమ్మండి...'

'అవునవును. మా ఆఫీసులో కూడా నీళ్ళకు యిబ్బందిగానే వుంది.'

తర్వాత వాళ్ళిద్దరూ తమ గ్రామం గురించి మాట్లాడుకున్నారు.

ఒక మంచిరోజు చూసుకుని శ్రీపతిరావు ఔట్‌హౌస్‌లో చేరాడు. భార్య వచ్చేంతవరకు స్వయంపాకంతో కాలక్షేపం చెయ్యాలనుకున్నాడు. అప్పుడప్పుడు వరహాలరావు అతని యోగక్షేమాలు కనుక్కుని వెళ్లేవాడు. మాట తీరు అదో మోస్తరుకాని మనిషి మంచివాడుగానే కనిపిస్తున్నాడని శ్రీపతిరావు సంతోషించాడు.

ఒకరోజు వుదయం 'బాబూ, బాబూ' అని తలుపుకొట్టిన చప్పుడయింది. శ్రీపతిరావు ఆదుర్దాగా తలుపుతెరిచి చూశాడు.

'బాబూ, నన్ను పాల వెంకయ్య అని పిలుస్తారు...'

'మీ సంగతి అయ్యగారు చెప్పారు'

'పదేళ్లుగా పాలు పోస్తున్నానండి అయ్యగారికి. ఒకటో రకం పాలు. మీరు కూడా తీసుకుంటారని అయ్యగారు చెప్పారండి'

'అయితే యివాళ్టి నుంచి పొయ్యండి. తీసుకుంటాను. నెలనెలా పేచీలేకుండా మీకు పైకమిస్తాను...'

'పైకంటండి ముఖ్యం! పాలు పితుకుతుంటే యిద్దరు ముగ్గురు అడిగారు. వాళ్లకి పొయ్యకుండా మీకు పెసలుగా తీసుకొచ్చాను'

ఉబ్బిపోయాడు శ్రీపతిరావు. గిన్నె తీసుకువచ్చాడు. నురుగు రాకుండా చెయ్యి అడ్డంపెట్టి పాలు పోశాడు వెంకయ్య.

'చూడడానికి చిక్కగానే వున్నాయి'

'తాగి చూస్తే మీకే తెలుస్తుంది రుచి.. ఈ పట్టణం మొత్తం మీదా యిలాంటి పాలు ఎక్కడా దొరకవంటే నమ్మండి.' అంటూ వెంకయ్య వెళ్లిపోయాడు.

పదిరోజులు గడిచాయి.

ఒకనాడు వెంకయ్య పాలు పితుకుతుంటే దగ్గరికి వెళ్ళి నుంచున్నాడు శ్రీపతిరావు.

'ఏం బాబూ, యిలా వచ్చారు?'

'ఊరికేనే'

పాలు పితకడం పూర్తి అయింది.

శ్రీపతిరావు గిన్నెను ముందుకు చాచాడు.

'మొట్టమొదట అయ్యగారికి పోసిన తర్వాత మిగిలితేనే మీకు...' అన్నాడు వెంకయ్య నిర్లక్ష్యంగా.

'మరి యిన్నాళ్లుగా ఎలా పోస్తున్నట్టు?'

'మొన్నమొన్నటిదాకా పాలు బాగానే యిచ్చేది ఆవు. ఇప్పుడు తక్కువవు తున్నాయి...' అంటూ బంగళాలోకి దారితీశాడు.

చెట్టంత మనిషి తానక్కడ నిలబడ్డా తననుకాదని ముందుకిపోయిన వెంకయ్య మీద ఎక్కడలేని కోపం వచ్చింది శ్రీపతిరావుకి. నిగ్రహించుకున్నాడు. ఇంతలో వెంకయ్య రానే వచ్చాడు. వస్తూనే, 'ఏదీ గిన్నె?' అడిగాడు కావాలని అతను 'ఎందుకు' అని ప్రశ్నించాడు.

'పాలు పోయించుకోరా మరి?'

'పాలు తక్కువగా వున్నాయన్నావుగా'

'అవును. అందుకే కొంచెం నీళ్ళు కలిపాను'

ఉగ్రుడయ్యాడు శ్రీపతిరావు. 'నీ పాలు నీ దగ్గరే వుంచుకో. అయితే యిన్నాళ్లుగా మాకు పోసింది నీళ్ళపాలా?'

'నీళ్లపాలే... నువ్విచ్చే పైకానికి చిక్కని పాలెవరు పోస్తారు?'

'మాటలు సరిగా రానీ...'

'ఏం చేస్తావేమిటి? అడిగినప్పుడల్లా అయ్యగారు నాకు సహాయం చేస్తారు. ఆవు కొనాలంటే అడ్వాన్సు యిస్తారు. ఆయన వల్లే నేను పాల వ్యాపారం చెయ్యగలుగుతున్నా. ఆ సంగతి గుర్తుంచుకో...'

'అయితే పాలన్నీ ఆయనగారికే పోయ్...'

'అది మీరేం చెప్పక్కర్లేదు. ఇన్నాళ్ళూ నేను పోసిన పాలకి లెక్కకట్టి నా పైకం నా మొహాన పారెయ్యండి...'

'నెల మధ్యలో పైకానికి నేనెక్కడికి పోను? జీతం రాగానే యిచ్చేస్తాను...'

'ఈ మాత్రం దానికే యింత అధికారమా?' శ్రీపతిరావు ఇంట్లోకి వెళ్ళాడు.

'ఈయనిచ్చే పైకంతో నా సంసారం గడుస్తున్నట్టు అనుకున్నాడు కాబోలు.. ఇలాంటి వాళ్లని ఎందర్నో చూశా. ఎవడిక్కావాలి యీన పైకం... అడగాలేగాని మా అయ్యగారు వందలూ వేలూ యిస్తారు...' అంటున్నాడు వెంకయ్య.

తననుకాదు, తన కష్టార్జితమైన పైకాన్ని తక్కువచేసి మాట్లాడినందుకు శ్రీపతిరావు చాలా బాధపడ్డాడు.

ఆ నెల తెరక్కముందే అతను ఔట్‌హౌస్ ఖాళీ చేశాడు. ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోతుంటే, 'ఏం బాబూ, ఎక్కడైనా దొరికిందా యిల్లు' బాధగా అడిగాడు నరసయ్య. అయ్యగారికి భయపడి అంతకంటె అతను ఎక్కువగా మాట్లాడలేకపోయాడు.

'పేదవాని పైకం కూడా పైకమేనని రుజువుచేసి చూపిస్తా...' కోపంగా అన్నాడు శ్రీపతిరావు.

నరసయ్య మనస్సు సంతోషంతో నిండిపోయింది.